క్లుప్తంగా

బోధన విద్యార్థి శోధనకు దిక్సూచి కావాలి

కడప ఎడ్యుకేషన్ : బోధన విద్యార్థి శోధనకు దిక్సూచి కావాలని సముదాయ ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత అన్నారు. నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో సముదాయ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండవ రోజు శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సముదాయ పరిధిలోని ఉపాధ్యాయులందరూ సమావేశంలో నేర్చుకున్న కొత్త విషయాలను పాఠశాలస్థాయిలో అమలయ్యే విధంగా కృషి చేయాలన్నారు. రీసోర్సు పర్సన్లు షుగుప్తా యాస్మిన్, ఇమామ్‌ఖాసీం మాట్లాడారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ కార్యాలయంలోని డీఈ టెక్నికల్ నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉపాధికి ప్రమాదం ఏర్పడిందన్నారు. అలాగే మీటర్ రీడర్లలో నాన్ టెక్నికల్‌గా ఉన్న వారికి అర్హత బట్టి సంస్థలోనే ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూఈఈయూ రాష్ట్ర కార్యదర్శి పి.సుదర్శన్ రెడ్డి, యూఈసీయూ జిల్లా అధ్యక్షులు కే. శ్రీనివాసులు పాల్గొన్నారు.

రక్తదానం



వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'సేవా పక్వాడా' కార్యక్రమంలో భాగంగా బుధవారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం.రమేష్, వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్.వెంకటరామిరెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయ మేనేజర్ భాస్కర్, రిమ్స్ అధికారులు, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరంలోని మురాదియానగర్ లో వెలసిన ఆస్థాన ఏ మురాదియ దర్గాలో బుధవారం 'ఆదాబే మస్జిద్' కరపత్రాలను ఆ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా మొహమ్మద్ జమాలుల్లా బాషా సాహెబ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఆదాబే మస్జిద్ కరపత్రాలను ముస్లిం సోదరుల కోసం ప్రత్యేకంగా తయారు చేయించామన్నారు. ముఖ్యంగా మస్జిద్ లో లోపలికి వెళ్లేటప్పుడు, బయటకి వచ్చేటప్పుడు చేసే (దువాలను) ప్రార్థనల గురించి ప్రతి ముస్లిం తెలుసుకోవాలన్నారు. అందుకోసం క్లుప్తంగా ఈ కరపత్రాలలో మస్జిద్ నియమ నిబంధనల గురించి పలు సూచనలు, అవగాహన కరపత్రాలను ముద్రించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

దిశ చట్టం మహిళలకు రక్ష

కడప స్పోర్ట్స్ : ప్రభుత్వం తీసుకువచ్చిన దిశ చట్టం మహిళలకు ఎంతో రక్షణగా ఉపయోగపడుతోందని దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళీమోహన్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలో 'మహిళల అక్రమ రవాణ – దిశ యాప్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్ని చట్టాలు వచ్చినా మనుషుల అక్రమ రవాణా బాధితుల సంఖ్య లక్షల్లో ఉండటం విచారకరమన్నారు. వెట్టిచాకిరీ, లైంగిక అవసరాల కోసం పురుషులు, మహిళలు, చిన్నారులు ఎక్కువగా బాధితులుగా మారుతున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. మూర్తి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు పాల్గొన్నారు.

మినుము, పెసర విత్తనాల పంపిణీ

వీరపునాయునిపల్లె : రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మినుము, పెసర పంటకు సంబంధించి విత్తనాలను 80 శాతం రాయితీతో అందిస్తున్నాడని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. ఎస్.పాలగిరి సచివాలయ పరిధిలోని రైతులకు ఆయన బుధవారం విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో వర్షాభావ దృష్ట్యా పంటలు సాగుచేయలేక పోయిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు పెసర, మినుములను అందజేశామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ మండలంలో టిబిజి–104 రకం మినుములు 110 క్వింటాళ్లు, ఐపిఎం 2–14 రకం పెసలు 19.80 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనం కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ ద్వారా విత్తనాలను పొందాలన్నారు. ఒక్కో ఎకరానికి 8 కేజీలు చొప్పున 5 ఎకరాల వరకు అందిస్తారన్నారు.

ప్రజా ప్రయోజిత న్యాయసేవలపై అవగాహన



పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

కడప అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రయోజిత సేవలను అందించేందుకు అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి తెలియజేశారు. బుధవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాసదన్‌లో శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలు చైర్మన్ స్వర్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజిత, న్యాయసేవలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలలో రవాణా సేవలు, విద్యుత్ సరఫరా కాంతి లేదా నీరు సేవలు, ప్రజా సంరక్షణ లేదా పారిశుద్ధ్యం, ఆసుపత్రిలో సేవలు డిస్పెన్సరీ, బీమాసేవ, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సంస్థలు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, విద్యా, విద్యాసంస్థలు, హౌసింగ్, రియల్ ఎస్టేట్ సేవలు, శాశ్వత లోక్ అదాలత్, పార్టీల మధ్య వివాదంలో వున్న విషయాన్ని సామరస్య పూర్వక పరిష్కారం ద్వారా లేదా అర్హతల ఆధారంగా అవార్డులను ఆమోదించడానికి శాశ్వత లోక్ అదాలత్‌లకు న్యాయనిర్ణేత అధికారం వుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లు సంబంధిత జిల్లా ప్రధాన కార్యాలయంలో న్యాయసేవాసదన్ భవన సముదాయాలలో పనిచేస్తున్నాయన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం 1987లోని సెక్షన్–22ఏలో పేర్కొన్న అన్ని సేవలకు సంబంధించి, సేవాలోపం, పరిహారం కోసం క్లెయిమ్, డబ్బు రికవరీ మొదలైన వాటికి సంబంధించిన వివాదాలను శాశ్వత లోక్ అదాలత్ పరిష్కరించగలదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత, లోక్ అదాలత్ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా ఎంపికలు



అండర్-14, అండర్-17 టెన్నికాయిట్ బాలబాలికల జట్టు



జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, అవుట్‌డోర్ స్టేడియంలు వేదికగా బుధవారం నిర్వహించిన కడప నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలస్థాయిలో రాణించిన క్రీడాకారులకు నియోజకవర్గస్థాయి ఎంపికలు, ఇక్కడ రాణించినవారికి జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు బ్యాడ్మింటన్, యోగ, టెన్నికాయిట్ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో ఎంపికలు నిర్వహించి కడప నియోజకవర్గ జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కడప నియోజకవర్గ సమన్వయకర్త బి. నిత్యప్రభాకర్, ఏపీ పీఈటీ అండ్ ఎస్ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. ప్రవీణ్‌కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు జిలానీబాషా, సాజిత్, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, సువర్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : కడప మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఇందులో అండర్ –17 బ్యాడ్మింటన్ విభాగంలో 9వ తరగతి నుంచి గీతికాంజలి, దీప్తి, 8వ తరగతి నుంచి ఈశ్వర్ ఎంపికయ్యారు. అలాగే యోగాలో అండర్ 17 బాలికల విభాగంలో 9వ తరగతి నుంచి భానుతేజ, అండర్ –14 బాలికల విభాగంలో 7వ తరగతి నుంచి మనస్వీ, పద్మశ్రీలు, టెన్నీకాయిట్‌లో అండర్ –14 బాలికల విభాగంలో 8వ తరగతి నుండి మనోజ్ఞ, అనన్యారెడ్డిలు తమ ప్రతిభను చాటి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ చైర్మన్ యం. శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవిలు అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఈనెల 22–24 వరకూ జరిగిన పోటీల్లో 400 మీటర్ల హర్డిల్స్ పరుగు పందెంలో కడప నగరానికి చెందిన ఎస్. నందిత తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

నిర్మాణాలు చేపట్టనివారికి నోటీసులివ్వండి

సిద్దవటం : పక్కా గృహాల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం పక్కాగృహాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఆర్డీఓ దర్మచంద్రారెడ్డి మాట్లాడుతూ మండల టీమ్ సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులతో పక్కాగృహాలను నిర్మించాలన్నారు. ఏ సచివాలయం పరిధిలో లక్ష్యం ఇచ్చామో అక్కడే అధికారులు నివాసం ఉండి పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. పక్కాగృహాల లక్ష్యాలను పూర్తి చేయని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డికి ఆదేశించారు. తహసీల్దారు లక్ష్మిదేవి, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ చెన్నయ్య తదితరులున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

పర్యాటక కేంద్రాలను కాపాడుకుందాం

ఒంటిమిట్ట : దేశంలో అత్యున్నత సంపదైన పర్యాటక కేంద్రాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా పర్యాటక సిబ్బంది రాంకుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రలోని హరితా హోటల్ మేనేజర్ కిశోర్ ఆధ్వర్యంలో హరితా హోటల్ వద్ద నుంచి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం వద్దకు పలు పాఠశాల, కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ పరిసరాలలో ఉన్న చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కడప డివిజన్ పర్యాటక సిబ్బంది జాషువ, ఈశ్వరయ్య, శ్రీధర్, కడప కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, కోటిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు లెసన్ ప్లాన్, డైరీ తప్పనిసరి

సిద్దవటం : అన్నీ పాఠశాలల ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్, డైరీలు తప్పనిరిగా రాయాలని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట గాంధీ వీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ శంకరయ్య, సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, వైఎస్ఆర్ జిల్లా టోఫల్ నోడల్ ఆఫీసర్ డీవీఎస్ ప్రసాద్‌రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో తగిన సామర్థ్యాలను ఉపాధ్యాయులు పెంపొందించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సమయానికి హాజరై జరగవలసిన కార్యక్రమాలను సక్రమంగా జరపాలని సూచించారు. టోఫల్ నోడల్ అధికారి డీవీఎస్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇంగ్లిష్ ప్రాధాన్యత, ఇంగ్లీష్ మీడియంలో విద్యను అభ్యసిస్తే ఉండే లాభాలు తెలియజేశారు. ఇంగ్లిష్ భాషను చదవడం, రాయడం, వినడం, అర్థం చేసుకోవడం ఎలా అనే అంశాన్ని పిల్లలకు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పాఠశాలలో విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డీఈఓ వై.రాఘవరెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ ఎ.ప్రభాకర్‌రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ రమేష్ తెలిపారు. స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో బుధవారం పాఠశాలల భద్రతపై నియోజకవర్గంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మండల స్థాయిలో ఒక కమిటీని, పాఠశాల స్థాయిలో ఒక కమిటీని నియమించాలన్నారు. పాఠశాలలో నాడు–నేడు పనుల కోసం తవ్విన గుంతల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, గుంతలలో ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందకుండా కిరోసిన్ వేయాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

నాడు–నేడు పనులు జరుగుతున్న పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని, శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా రక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఆసారే షరీఫ్

కడప కల్చరల్ : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కడప నగరంలోని బగ్గాదియా నగర్‌లోని ఆస్థాన ఏ బగ్గాదియాలో గురువారం ఆసారే షరీఫ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్థాన ఏ బగ్గాదియా అహలె సున్నత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు 'ఆసారే షరీఫ్' ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకూ ఆసారేషరీఫ్ దర్శనం ఉంటుందని తెలిపారు. అలాగే ఆస్థాన ఏ బగ్గాదియా– మస్జిద్ ఏ బగ్గాదీయా ఆధ్వర్యంలో ఉదయం 5 నుంచి రోజంతా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అందరూ పాల్గొనాలని కోరారు.

స్వచ్ఛభారత్

వైవీయూ : ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల నుంచి ఒంటిమిట్ట పుణ్యక్షేత్రానికి వలంటీర్లు పయనమై.. అక్కడ ఆలయ పరిసరాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి, నీరుపోశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, జిల్లా టూరిజం మేనేజర్ ఎస్. మల్లికార్జున, రామ్‌కుమార్, కళాశాల టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డా. గురుమోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఘన సత్కారం..

ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రవేశపెట్టి, విశేష ప్రాచుర్యం కల్పించిన వేంపల్లి చరిత్రశాఖ అధ్యాపకులు బాలగొండ గంగాధర్‌ను బుధవారం కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాలు చేయడం ద్వారా అనేక అనర్థాలు ఉన్నాయని ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ స్టేట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్ రెవరెండ్ విజయ్ కిషోర్ తెలిపారు. బుధవారం బాల్య వివాహ నిర్మూలన అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాతే వివాహం చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా లేదా రెండూ విధించడం జరుగుతుందన్నారు. ఈ అంశంపై ఫాస్టర్లు చర్చిలకు వచ్చే విశ్వాసులకు వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రేమ అనురాగాలకు నిలయం సీఎస్ఐ

కమలాపురం : ప్రేమ అనురాగాలకు నిలయం సీఎస్ఐ (చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) అని స్థానిక సీఎస్ఐ చర్చి ఫాస్టర్ భరత్ హెరాల్డ్ తెలిపారు. బుధవారం సీఎస్ఐ చర్చి 76 వసంతాలు పూర్తి చేసుకోవడంతో రాయలసీమ డయాసిస్ బిషప్ రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్ ఆదేశాల మేరకు పలు కాలనీల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘ సభ్యులందరూ సీఎస్ఐ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి

సిద్దవటం : గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న తెలిపారు. సిద్దవటం మండలంలోని మంగనవాండ్లపల్లె గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించి, పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు సుధారాణి, అంగన్‌వాడీలు లక్ష్మిదేవి, మునెమ్మ, షమీన, మాదవి, విజయ, సిద్దవటం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదిరతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తనిఖీ

సిద్దవటం : మండలం లోని జ్యోతి రైతు భరోసా కేంద్రం పరిధిలోని గ్రామాలలో ఈ– పంట నమోదు వివరాలను బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ– పంట నమోదులో రైతుల పేర్లను, ఖాతా నెంబర్, సర్వేనెంబర్, పంట రకం, సాగునీటి వనరులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తేడాలను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఖరీఫ్ 2023 సీజన్‌లో ఈ– పంట నమోదు చేసుకోవడానికి ఈనెల 30వ తేదీ చివరి తేదీ అన్నారు.

రాజారెడ్డి వీధిలో విస్తరణ పనులు పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్ : రాజారెడ్డి వీధిలో అడ్డంగా ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి, ఆక్రమణలన్నీ తొలగించాలని కేఎంసీ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం హబీబుల్లా వీధి, మండీ బజార్, సెవెన్‌రోడ్స్, రాజారెడ్డి వీధి ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. హబీబుల్లా వీధిలో కల్వర్టు ఏర్పాటు చేయాలని, రోడ్లపై ఉన్న గుంతలకు మరమ్మతులు చేయాలని సూచించారు. పెద్ద కాలువల్లో పూడిక తీత పనులను మొదలు పెట్టాలన్నారు. ఏడురోడ్ల కూడలిలో మ్యాన్ హోల్స్‌కు మరమ్మతులు చేసి, బీటీ రోడ్డు వేయాలన్నారు. పాత బస్టాండు సర్కిల్ ఏర్పాటు చేయుటకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాజారెడ్డి వీధిలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఈఈ నారాయణస్వామి, ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కడప నగరంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్తీ హోం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ వారితో నగరాభివృద్ధిపై చర్చించారు. అంతకుముందు మున్సిపల్ మెయిన్ స్కూల్‌ను తనిఖీ చేశారు.

విద్యార్థులకు అభినందన



పాత బస్టాండు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప స్పోర్ట్స్ : కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పతకాలు సాధించడంతో పాటు ముగ్గురు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల కడప నగర పాలక సంస్థ కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్ చంద్ అభినందించారు. బుధవారం మున్సిపల్ హైస్కూల్ లో నిర్వహించిన కార్యక్రమంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఇటీవల ఎన్‌టీఆర్ జిల్లా నున్నలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు 9 పతకాలు సాధించిన విషయం తెలిసిందే. జిల్లాకు 14 పతకాలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, పీఈటీ వెంకటలక్ష్మిదేవి పాల్గొన్నారు.

రోడ్డుపై డ్రైనేజీ నీరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం ఓం శాంతినగర్ రోడ్డు నెంబరు 10లో రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు నెలలుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుండి ఉబికి వస్తున్న మురికి నీటి కారణంగా ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి ఉబికి వస్తున్న మురికి నీరు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

వైవీయూ : విద్యారంగ సమస్యల పరిష్కారంపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అలుపెరగని పోరాటం చేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్, కార్యదర్శి యాచేంద్ర పేర్కొన్నారు. బుధవారం వైవీయూలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండురోజుల పాటు నిర్వహించే ఈ సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ కోడూరు మల్లికార్జున, జిల్లా సంఘటన కార్యదర్శి పెంచలయ్య, జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను ప్రారంభిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

భక్తి శ్రద్ధలతో జష్నే మిలాద్

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాలో జష్నే మిలాదున్నబి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం రాత్రి దర్గా పీఠాధిపతి సజ్జాద్–ఏ–నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజన సందోహం నడుమ మిలాద్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చిన పూల చాదర్లను స్వామివార్ల మజార్లపై సమర్పించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి ముహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన దాదాపు 100కు పైగా వస్తువులను ప్రదర్శనకు (ఆసారే షరీఫ్) ఉంచారు. భక్తులు వాటిని చూసేందుకు ఆసక్తి చూపారు. అనంతరం రాత్రి నిర్వహించిన బయాన్‌లో భక్తులను ఉద్దేశించి పీఠాధిపతి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జననం, మరణం ఒకే రోజు జరిగాయని, ఆ రోజునే మనం మిలాదున్నబిగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దస్తగిరి స్వామి, మౌలానా స్వాములు మిలాద్ ప్రత్యేకతను వివరించారు. అనంతరం భక్తులకు గఫారియా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని జామీయా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్‌పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన జ్ఞాపికలకు గంధోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం రాత్రి మెయిన్ బజార్‌లో ఉన్న ఆస్థానయే జామియాలో భక్తులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు ఇర్షాద్ జానీఖాద్రీ, సయ్యద్‌షా అసద్ పాషాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



ఆసారె షరీఫ్‌ను ప్రారంభిస్తున్న పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి

ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలను బలోపేతం చేయాలి

ప్రొద్దుటూరు : ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలను బలోపేతం చేయాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. స్థానిక డీసీసీ బ్యాంకులో బుధవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.1,62,523 కోట్లు కేటాయించిందన్నారు. ఈ నిధులను నాబార్డ్, ఎన్‌జీడీసీ, ఎన్‌డీడీపీ, ఎన్ఎఫ్‌డీబీ సంస్థల ద్వారా సహకార సంఘాలకు నిధులు అందిస్తారని చెప్పారు. సంఘం నిర్వహణలో సభ్యుల భాగస్వామ్యం అంతంత కీలకమని తెలిపారు. తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించి సకాలంలో చెల్లించాలన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా సభ్యులు బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. కడప డీసీసీబీ సలహాదారుడు యు.సహదేవరెడ్డి, ఆప్కాబ్ వీరశంకర్‌బాబు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఎస్‌డీఎల్‌సీఓ అధికారులు ఎంవీ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

సిద్దవటం సీహెచ్‌సీలో ఆర్థోపెడిక్ వైద్య సేవలు

సిద్దవటం : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం డాక్టర్ మధుశేఖర్ పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ రవి దీర్ఘకాలిక నొప్పులు, కీళ్లవాతం, నడుము నొప్పులు ఉన్నవారికి చికిత్సను అందించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ వైద్యుడు రవి మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు సిద్దవటంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్న పేషెంట్లకు శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. అందులో భాగంగా మోకాళ్ల నొప్పులకు, నడుము నొప్పులకు, వెన్నుపూస నొప్పులతో బాధపడుతున్న పేషంట్లకు చికిత్స అందిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఇక్కడ క్యాంపు చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు తెలియజేశారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు సందు శివనారాయణ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా గౌరవాధ్యక్షుడిలుగా సందు శివనారాయణ, రామేశ్వరం ప్రభు కుమార్, జిల్లా కన్వీనర్‌గా బి.వెంకటరమణరాజు, ప్రధాన కార్యదర్శిగా జింకా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా జింకా జయప్రకాష్, పి.సుధాకర్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా బి.రమేష్‌రాజులను ఎన్నుకున్నామన్నారు. అలాగే రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా బి.వెంకటరమణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కత్తి విజయ కుమార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.



జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు